## పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల శిక్ష

- బాధిత బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలన్న కోర్టు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

చిన్నారులపై అత్యాచార నేరాలకు వ్యతిరేకంగా పోక్సో చట్టం కింద నమోదైన కేసులో నిందితుడైన కాటేల కృష్ణస్వామి అలియాస్ చిన్న (25) కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ, రూ.1,500 జరిమానా విధించినట్లు జిల్లా అదనపు జడ్జి ఎల్. శ్రీనివాస్ నాయక్ తీర్పు తెలిపారు. అలాగే బాధిత బాలికకు రూ.1 లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు.చెన్నూర్ మండలం శివలింగాపూర్‌కు చెందిన కృష్ణస్వామి వృత్తిరీత్యా అంబులెన్స్ డ్రైవర్. 2019 జూలై 17న సాయంత్రం 5 గంటల సమయంలో పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలికను బెదిరించి బలవంతంగా స్కూటీపై ఎక్కించుకొని తీసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి చెన్నూరు ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రమోద్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం విచారణ కొనసాగింది. కేసు విచారణలో చెన్నూర్ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ ఎం.ఏ. మజీద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ. రాంబాబు ఆధ్వర్యంలో సాక్షులను హాజరుపరిచారు. అన్ని ఆధారాలు పరిశీలించిన జిల్లా అదనపు జడ్జి బుధవారం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాలను జైపూర్ ఏసీపీ ఏ. వెంకటేశ్వర్ వెల్లడిస్తూ చిన్నారులపై జరిగే నేరాలకు పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతోంది. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును విచక్షణతో చూసి తగిన చర్యలు తీసుకుంటాం అన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**శెనార్తి మీడియా, శంకరపట్నం**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం సిపిఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆగష్టు 19 నుంచి 22వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.శంకరపట్నం మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్మికులు, రైతులు, కూలీలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్ర మహాసభల్లో మండలంలోని సమస్యలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని 23 గ్రామాల నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని ఆయన అభిలషించారు.ఈ కార్యక్రమంలో ఎండి బాదుల్లా, రేగుల కుమార్, ఆరెపల్లి తిరుపతి, గోదారి లక్ష్మణ్, ఆడితం రమేష్, ఎలుకపెల్లి సమ్మయ్య, దేవనూరి కొమరయ్య, రెడ్డి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన మొక్కల నాటింపు లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం లక్షెట్టిపేట మండలం చందారం, దౌడేపల్లి, వెంకట్రావుపేట, కొత్తూరు గ్రామాలలో నర్సరీలు, మొక్కలు నాటే పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు.భవిష్యత్ తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు వనమహోత్సవం కార్యక్రమం ఎంతో కీలకమని కలెక్టర్ తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను సమన్వయంతో పూర్తి చేసి మొక్క లను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల్లో ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, దశలవారీగా బిల్లుల ను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి నీటి ట్యాంక్‌ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో



పిల్లలకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఏపీఓ వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ చైతన్యానికి జయశంకర్ కృషి**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జరిగిన జయ శంకర్ 91వ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ''తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలలో ఆచార్య జయశంకర్ కీలక పాత్ర పోషించారు. చిన్నతనం నుంచే ప్రశ్నించే స్వభావంతో ప్రజల హక్కుల కోసం పోరాడారు. నీరు–నిధులు–నియామకాలలో అసమానతలను వెలికి తీసి ప్రజల్లో చైతన్యం కలిగించారు. తన రచనలతో తెలంగాణ ఉద్యమాన్ని గ్రామాగ్రామానికి తీసుకెళ్లిన నేత'' అని కొనియాడారు. జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.అనంతరం నెన్నెల మండల తహసీల్దార్ జ్యోతి హఠాన్మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార శాఖల అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.నీటిపారుదల, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మున్సిపల్, మిషన్ భగీరథ, రోడ్లు–భవనాలు, టి.జి.ఎం. ఎస్.ఐ.డి.సి., సింగరేణి సివిల్ విభాగాల అధికారులతో కలెక్టర్ అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్షించారు. మురుగు కాలువలు, రహదారులు, చెరువుల పూడికతీత, ఓపెన్ జిమ్‌లు, వీధిదీపాలు, కమ్యూనిటీ హాల్స్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి, బిల్లులు సకాలంలో సమర్పించాలని తెలిపారు.పనుల విభాగాల వారీగా సమీక్షిస్తూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి పూర్ణచంద్రరావు, సింగరేణి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జయశంకర్ జయంతి వేడుకలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల / గోదావరిఖని**




తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని అడ్మిన్ ఇంచార్జ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రొ. జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితం అంకితం చేసిన సిద్ధాంతకర్త జయశంకర్ అని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్, నాన్ ముల్కీ ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొని దేశ వ్యాప్తంగా వేదికల ద్వారా తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ప్రజలను చైతన్యం చేసిన వైనాన్ని వివరించారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పిన ఉద్యమ నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని చెప్పారు.జయ శంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, భీమేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, దామోదర్, మల్లేశం, వామన్ మూర్తి, సూపరిండెంట్‌లు ఇంద్రసేనా రెడ్డి, సందీప్, సంధ్య, సీసీ హరీష్, సిపిఓ, వింగ్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల అసభ్యకర వీడియోలు

- నస్పూర్‌లో వ్యక్తి అరెస్ట్
- ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కర్రు సందీప్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

సోషల్ మీడియాలో చిన్నారుల అసభ్యకర వీడియోలను షేర్ చేసిన ఘటనలో నస్పూర్‌కు చెందిన కర్రు సందీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయం నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ & ఎక్స్‌ప్లటెడ్ చిల్డ్రన్ (ఎంసీఎన్ఈసి) గుర్తించి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగానికి సమాచారం అందించింది.సైబర్ సెక్యూరిటీ వింగ్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా నస్పూర్ పోలీసులు సైబర్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంచిర్యాల రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. అశోక్ నేతృత్వంలో విచారణ జరిపి, నిందితుడిపై ఆధారాలు సేకరించి అదుపులోకి తీసుకున్నారు.ఇంటర్నెట్‌లో చిన్నారుల అసభ్యకర విషయాలను వెతకడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం తీవ్ర నేరమని ఇన్‌స్పెక్టర్ అశోక్ హెచ్చరించారు. ఇటువంటి అకృత్యాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కేసు వివరాలను వెల్లడించిన ప్రెస్‌మీట్‌లో నస్పూర్ ఎస్ఐ ఉపేందర్ రావు పాల్గొన్నారు.సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, అసభ్యకర విషయాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- కలెక్టరేట్ వద్ద యూఎస్ఎఫ్ఐ ధర్నా

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తాటికొండ రవి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలం గడుస్తున్నప్పటికీ దాదాపు రూ.8 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్‌ను విడుదల చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల పోస్టులు, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ వైఖరిని ఎండగట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ఆందోళనలు చేపడతామని తాటికొండ రవి హెచ్చరించారు.ఈ ధర్నాలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు మణిచెరణ్, నాయకులు రెహమాన్, సంజయ్, ఆకాష్, వెంకటచరణ్, దినేష్, కార్తీక్, మణిదీప్, అనిల్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** స్వరాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమించిన ప్రొఫెసర్ జయశంకర్‌అశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐ క్యసంఘం మండల అధ్యక్షుడు తాటికొండ సదానందచారి అన్నారు.మండల కేంద్రంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం మండల అధ్యక్షుడు తాటికొండ సదానందచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలవేసి, కులస్తులు సహా వివిధ వర్గాల ప్రజలు నివాళులర్పించారు.కార్యక్రమంలో పంచకోటి రాజు, మంతెన రాజమౌళి, శ్రీనివాస్, పూకంటి రవీంద్రాచారి, నర్సింగోజు సంతోష్ చారి, సమ్మయ్య చారి, వద్లూరి రాములు, చల్లూరి రామస్వామి పాల్గొన్నారు.

## అక్రమంగా ధాన్య విక్రయించిన రెండు రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

- ధాన్యం విలువ రూ.45 కోట్లు
- అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించిన రెండు రైస్ మిల్లర్లపై హాజీపూర్ పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు.హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీసాయి మణికంఠ ట్రేడర్స్ లో గత యాసంగి 2022-23, 2023-24లో 4,108 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం అయినట్లు గుర్తించామని, మిల్లు యజమానులు గంప శ్రావణ్ కుమార్, కేతిరెడ్డి అనిల్ రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ధాన్యంతో పాటు జరిమానా కలిపి దాని విలువ రూ.14.86 కోట్లు ఉంటుందని చెప్పారు.అదే గ్రామంలోని శ్రీరాజ రాజేశ్వరి ట్రేడర్స్ లో 2022-23, 2023-24, వానాకాలం 2024-25లో 8,578 మెట్రిక్ టన్నుల ధాన్యం లేకపోవడంతో మిల్లు యజమానులు గంప సంతోష్ కుమార్, కేతిరెడ్డి మల్లారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఈ ధాన్యం విలువ జరిమానాతో కలిపి రూ.30.57 కోట్లు ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 17 రైస్ మిల్లర్లపై ధాన్యం అక్రమ విక్రయాల కేసులు నమోదు చేశామని, రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా ప్రభుత్వానికి ఉన్న బాకీలను వసూలు చేయడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య తెలిపారు.

## మొరాయిస్తున్న వైకుంఠ రథాలు

- మున్సిపల్ అధికారులపై బీఎస్పీ నేత విమర్శలు




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో వైకుంఠ రథాలు పనిచేయక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. గత కొన్ని నెలలుగా వైకుంఠ రథాలు ముందు కదలనంటున్నాయనీ, తుది సంస్కారాలకు రథాలు అందుబాటులో లేక మృతదేహాల తరలింపుకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు. రథాల్లో ఉండాల్సిన ఫ్రీజర్లు కూడా పనిచేయడం లేదని మండిపడ్డారు. వృద్ధులు, రోగులు మరణించిన తరువాత వారి మృతదేహాలను భద్రంగా ఉంచడానికి ఉపయోగించే ఫ్రీజర్లు సరైన పరిస్థితిలో లేకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వైకుంఠ రథాలను, ఫ్రీజర్లను మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రజల కష్టాలు అధికారులు గమనించి తక్షణమే పరిష్కరించాలని రాజేంద్రప్రసాద్ కోరారు.

## బోథ్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ప్రారంభం..



శెనార్తి మీడియా, ఆదిలాబాద్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోసం ప్రత్యేకంగా క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.ఈ మేరకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి క్యాంప్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే,మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. నియోజకవర్గంలోని తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది కేమ శ్రీకాంత్, తిరుమల్ గౌడ్,సంధ్యారాణి, రవికాంత్ యాదవ్, సుధాకర్, కేదారేశ్వర రెడ్డి తదితరులున్నారు.

## ట్రెయినీ సర్వేయర్లకు అప్రెంటిస్షిప్

- ఎమ్మార్వో కార్యాలయాల్లో రిపోర్టింగ్..



శెనార్తి మీడియా, ఆదిలాబాద్

రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం అమల్లో భాగంగా లైసెన్స్ డ్ సర్వేయర్లకు ఇచ్చిన శిక్షణ పూర్తయింది.కాగా మండలాల వారీగా అప్రెంటిస్షిప్ ఇవ్వనున్నారు.ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల ఎమ్మార్వో కార్యాలయాల్లో ట్రెయినీ సర్వేయర్లు రిపోర్టింగ్ ఇచ్చారు.ఈ మేరకు ఆదిలాబాద్ రూరల్ మండల కార్యాలయంలో 12 మంది ట్రేయినీ సర్వేయర్లు తలసీల్దార్ గోవింద్ నాయక్ కు రిపోర్టింగ్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయి మహేష్,మండల సర్వేయర్ బట్టు గంగారం,ట్రెయినీ సర్వేయర్లు పాల్గొన్నారు.

## 8న సామూహిక వరలక్ష్మి వ్రతం..



శెనార్తి మీడియా, ఆదిలాబాద్

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ఆదిలాబాద్ పట్టణంలోని రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఓంప్రకాష్ శర్మ తెలిపారు.సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.మహిళలకు పూజా సామాగ్రిని ఉచితంగా అందజేస్తామని,అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి,బండారి వామన్, రవీందర్,సంతోష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో తహసీల్దార్ హఠాన్మరణం

శెనార్తి మీడియా, మంచిర్యాల



నేన్నెల తహసీల్దార్ జ్యోతి ప్రియదర్శిని గుండె పోటుతో మంగళవారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. గత కొద్దిరోజులుగా స్వల్ప అస్వస్థతతో ఉన్న ఆమె నస్పూర్‌లోని నివాసంలో అకస్మాత్తుగా గుండెల్లో నొప్పితో కుప్పకూలి పోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.జ్యోతి ప్రియదర్శిని గతంలో బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో కార్యనిర్వాహక అధికారిగా పనిచేశారు. జూలై 9న నేన్నెల తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన నెలరోజులకే ఆమె అకాల మరణం చోటుచేసుకోవడం శోచనీయమని అధికార వర్గాలు తెలిపారు. ఆమె తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తక్కువ కాలంలోనే ప్రజలకు అందుబాటులో ఉండి విశ్వాసం పొందారు. ఈ ఉదయం ఆమె మృతివార్త తెలిసిన వెంటనే సహచర అధికారులు, సిబ్బంది నస్పూర్‌లోని నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ జన్మదిన వేడుకలు

శెనార్తి మీడియా, మంచిర్యాల




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆధ్యాత్మిక బీజం వేసిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జన్మదిన వేడుకలు బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్లు సంయుక్తంగా ఈ వేడుకలను ఏర్పాటు చేశాయి.ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఎస్. నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం జీవితమంతా పోరాడిన జయశంకర్ గారి ఆశయాలను సాకారం చేయడమే యువత దైవిక బాధ్యత. విద్యార్థులు విద్యలో ప్రావీణ్యం సాధించి రాష్ట్రాభివృద్ధికి పాలకులు కావాలి" అని అన్నారు.ఈ సందర్భంగా ఎన్‌సీసీ యూనిట్ ఇన్‌చార్జి జాడి మహేష్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ ఉద్యమ చరిత్రను నూతన తరానికి పరిచయం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు. అలాగే, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. కుమార స్వామి మాట్లాడుతూ.. "జయశంకర్ గారి త్యాగాలు యువతకు మార్గదర్శకంగా నిలవాలని" ఆకాంక్షించారు.విద్యార్థులు జయశంకర్ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన చేసిన విశేష కృషిపై ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కార్యనిర్వాహక సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జయశంకర్ గారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో తెలంగాణ ఉద్యమ చరిత్రపై అవగాహన పెంపొందించడంతో పాటు, జయశంకర్ గారి ఆలోచనలు, సిద్ధాంతాలను పునఃస్మరించుకునేలా జరిగింది.

## పిల్లల ఆరోగ్యానికి నులిపురుగుల నివారణ చర్యలు ప్రారంభం



శెనార్తి మీడియా, మంచిర్యాల

జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆగష్టు 11వ తేదీన ఆల్బండజోల్ మాత్రలను పంపిణీ చేసి నులిపురుగులను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జూమ్ సమీక్షలో ఆయన అధికారులను ఆదేశించారు.జిల్లాలో 1,58,480 మంది పిల్లలకు ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పిల్లలు భోజనం చేసిన అనంతరం మాత్రలు చప్పరించాలనీ, శుద్ధమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలనీ కలెక్టర్ సూచించారు. ఏవైనా ఆరోగ్యపరమైన దుష్ప్రభావాలు కనిపిస్తే తక్షణమే సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు.1–2 ఏళ్ల వయస్సు పిల్లలకు సగం మాత్రను చూర్ణ రూపంలో, 2–3 ఏళ్ల వయస్సు పిల్లలకు పూర్తి మాత్రను చూర్ణం చేసి, 3 ఏళ్లకు పైబడిన పిల్లలందరికీ మాత్రలను నమిలి మింగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాత్రలను ఇంటికి పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు.నులిపురుగులు పోషకాహార లోపం, రక్తహీనత, బలహీనత వంటి సమస్యలకు కారణమవుతాయని, ఆల్బండజోల్ మాత్రల వాడకం వల్ల పిల్లల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ వివరించారు. 11వ తేదీన మాత్రలు తీసుకోలేని పిల్లలకు 18వ తేదీన మళ్లీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా. హరీష్ రాజ్, ఉపవైద్యాధికారి డా. అనిత, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి గోడప్రచారాన్ని ఆవిష్కరించారు.

## చెస్‌లో కార్మెల్ విద్యార్థుల ప్రతిభ

శెనార్తి మీడియా, మంచిర్యాల



మంచిర్యాల పట్టణంలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్లలో ప్రతిభను చాటారని ప్రిన్సిపాల్ సిస్టర్ సారోప్య తెలిపారు. ఇటీవల జరిగిన పోటీల్లో ఎం. ప్రహర్ష వర్ధన్, ఆర్. సాయి మనీశ్వర్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలని వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సీమ, సిస్టర్ సోఫియా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ బంగారు భవిష్యత్తు పై కొనియాడారు.

## ఇంటికెళదామా అమ్మా..!

### కంటతడిపెట్టించిన ఐదేళ్ల శ్రేయాస్ నందన్ మాటలు



**శెనార్తి మీడియా,శంకరపట్నం :** ''కుండ పగిలిందిగా.. అమ్మా ఇంటికెళ్లదామా..!'' అంటూ దహన వాటికలో ఐదేళ్ల చిన్నారి మాటలు అక్కడి ప్రతి హృదయాన్ని పిండేసాయి. భార్యా భర్తల మధ్య మనస్పర్థల కారణంగా వివాహిత ఆత్మహత్య ఘటన హృదయ విదారకంగా మారింది .శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన అమ్మిగళ్ల శ్రావ్య (27) ఆరేళ్ల క్రితం ధరమ్ తేజ్‌ను ప్రేమించి పెద్దల్ని ఎది రించి పెళ్లి చేసుకుంది. అయితే ఇటీవల వీరి మధ్య మన స్పర్థలు తీవ్రమవటంతో శ్రావ్య సెల్ఫీ వీడియో తీసి ఆత్మ హత్య చేసుకుంది.శ్రావ్య అంత్యక్రియల సందర్భంగా ఆమె ఐదేళ్ల కుమారుడు శ్రేయస్ నందన్ తల్లి చితికి నిప్పు పెట్టిన దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి గుండెను కదిలించింది. 'కుండ పగిలిపోయింది.. అమ్మ ఇంటికెళ్లదామా..' అంటూ తన అణుచుకున్న కన్నీళ్లతో అన్న చిన్నారి మాటలు అక్కడి వాతావరణాన్ని విషాదంగా మార్చాయి.ఇదిలా ఉండగా, బెహరాన్లో ఉన్న భర్త ధరమ్ తేజ్ కూడా అంత్యక్రియలకు హాజరై కన్నీటి పర్యంతమయ్యాడు. కుటుంబ కలహాలు ఎంతటి విషాదానికి దారి తీస్తాయో ఈ ఘటన మరోసారి చూపించిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

## సుష్మా స్వరాజ్‌కు నివాళి



శెనార్తి మీడియా, మంచిర్యాల

బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి, పద్మవిభూషణ్ సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పార్లమెంటులో కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ బిల్లు కోసం గళం వినిపించిన గొప్ప నేతగా ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమీరిశెట్టి రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శులు మేరడికొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణ, బొద్దున మల్లేశ్, డాక్టర్ రఘునందన్, ఆవిడపు రాజబాబు, రాకేష్ రెయిన్వా, దుర్గాప్రసాద్, గుండా రాజబాబు, తరుణ్ సింగ్, తాజ్ ఖాన్, పోనవేణి రవీందర్, కిషోర్ గౌడ్, దేవేందర్, పుదారి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు పెంపు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లాలో దినసరి వేతన కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జీవో జారీ చేశారు. అన్ స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్ కేటగిరీల్లో వేతనాలను మున్సిపల్, నాన్ మున్సిపల్, ఏజెన్సీ ప్రాంతాలవారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.జీవో ప్రకారం అన్ స్కిల్డ్ కార్మికులకు మున్సిపల్ ప్రాంతాల్లో రూ.574, నాన్ మున్సిపల్ ప్రాంతాల్లో రూ.521, ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.619 గా నిర్ణయించారు. సెమీస్కిల్డ్ కార్మికులకు మున్సిపల్ ప్రాంతాల్లో రూ.683, నాన్ మున్సిపల్ ప్రాంతాల్లో రూ.654, ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.766, స్కిల్డ్ కార్మికులకు మున్సిపల్ ప్రాంతాల్లో రూ.768, నాన్ మున్సిపల్ ప్రాంతాల్లో రూ.736, ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.853 గా నిర్ణయించారు.అదేవిధంగా ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగుల వేతనాలను కూడా పెంచుతున్నారు. ఈ జీవో అమలుతో ఒక్కో ఉద్యోగికి రూ.3000 నుంచి రూ.5000 వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 2022 తర్వాత మూడేళ్ల విరామం తరువాత ఈ జీవో విడుదల కావడం విశేషం.ఈ జీవో తాలూకు లబ్ధి తమ సంస్థలో పనిచేసే దినసరి కార్మికులకు కలుగుతుందని టీజీఎఫ్‌డీసీ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వివేక్, జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్బీఐ సేవలు అభినందనీయం..

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా




శెనార్తి మీడియా, ఆదిలాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన,ఎస్బీఐ నిర్మాణ్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు,బూట్లు పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఎం రామచంద్రరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, బాలకృష్ణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నాయుడు ఆలోచన అభినందనీయం..

- అవయవ దానం చేయడం ఆదర్శనీయం..
- మాజీ మంత్రి జోగు రామన్న..




శెనార్తి మీడియా, ఆదిలాబాద్

గణేష్ నాయుడు ఆలోచన అభినందనీయమని,అవయవాలు దానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మాజీ మంత్రి జోగు రామన్న కోరారు.ఆదిలాబాద్ కు చెందిన గజేందర్ నాయుడు జయంతి సందర్భంగా సుమారు 155 మంది అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి వారికి ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు.అవయవదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకొని వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు మెట్టు ప్రహల్లాద్, గణేష్ నాయుడు, పలాత్ అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయవద్దు..

- డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్..
- నలుగురు ఆర్ఎంపీలకు జరిమానా..



శెనార్తి మీడియా, ఆదిలాబాద్

ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దని, పరిమితులకు లోబడి ప్రాథమిక వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ డా.నరేందర్ రాథోడ్ సూచించారు.బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు క్లినిక్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులను మూసివేయాలని నోటీసులు అందజేశారు. అదేవిధంగా నింభందనలు ఉల్లంఘించిన నలుగురు ఆర్ఎంపీలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సాధన,వైసీ శ్రీనివాస్, శ్రీధర్ తదితరులున్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం.. పేదలకు అన్నదానం..



శెనార్తి మీడియా, ఆదిలాబాద్

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నదాత అడ కిరణ్ కుమార్ మాట్లాడుతూ..తన తండ్రి స్వర్గీయ భూమన్న జ్ఞాపకార్థం కుటుంబీకులతో కలిసి పేదలకు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేమ శ్రీకాంత్,శివకాంత్,సాయి గౌడ్,రామకృష్ణ,అక్షయ్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ సిరాజ్‌కు ఘనస్వాగతం

ఇంగ్లండ్ పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఘనస్వాగతం లభించింది. బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. భారీ ఎత్తున విమానాశ్రయానికి చేరుకున్న అభిమానులు.. సిరాజ్ భాయ్ సిరాజ్ భాయ్ అని గట్టిగా అరుస్తూ వెల్‌కమ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో సిరాజ్.. 185.3 ఓవర్లు వేసి 23 వికెట్లతో సత్తా చాటాడు. ఓవల్ వేదికగా ఐదు రోజుల పాటు ఉత్కంఠగా సాగిన ఆఖరి పోరులో మహమ్మద్ సిరాజ్(5/104) అద్వితీయమైన బౌలింగ్‌తో టీమిండియాను గెలిపించాడు. 374 పరుగుల లక్ష్యచేధనలో 339/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్.. సిరాజ్ ధాటికి 367 పరుగులకు ఆలౌటైంది. ఆఖరి రోజు ఆటలో ఇంగ్లండ్ విజయానికి 35 పరుగులే అవసరమవ్వగా.. సిరాజ్ సంచలన ప్రదర్శనతో జెమీ స్మిత్, జెమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్‌లను పెవిలియన్ చేర్చాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనతోనే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. మహమ్మద్ సిరాజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే యోచనలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఉంది. ఈ విషయాన్ని హెచ్‌సీఏ ప్రతినిధులు మీడియాకు తెలిపారు. 'మేం ఇంకా సిరాజ్‌తో మాట్లాడలేదు. కానీ మేం అతని కోసం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాం. అతను మరికొద్ది రోజులు హైదరాబాద్‌లోనే ఉండే అవకాశం ఉంది. ఇంగ్లండ్ పర్యటనలో దేశం తరఫున మెరుగైన ప్రదర్శన చేయడం మా అందరికీ గర్వకారణం'అని హెచ్‌సీఏ ప్రతనిధులు తెలిపారు.





# సిరాజ్ కెరీర్‌లో ఆల్‌టైమ్ బెస్ట్

## ఐసీసీ ర్యాంకింగ్స్ విడుదల

**టీమ్ఇండియా స్టార్ పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్ టెస్టు ర్యాకింగ్స్‌లో సత్తా చాటాడు. రీసెంట్‌గా ఇంగ్లాండ్ పర్యటనలో అదిరే ప్రదర్శన చేసిన సిరాజ్, ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఏకంగా 12 స్థానాలు ఎగబాకాడు.**

ప్రస్తుతం 674 రేటింగ్ పాయింట్స్‌తో 15వ స్థానానికి దూసుకొచ్చాడు. కాగా, సిరాజ్ కెరీర్‌లో అతడికి ఇదే అత్యుత్తమ ర్యాంకు కావడం విశేషం. ఇదే ఏడాది జనవరిలో సిరాజ్ ర్యాంకింగ్స్‌లో 16వ స్థానం దక్కించుకున్నాడు. మరోవైపు, ఇంకో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా కెరీర్ బెస్ట్ ర్యాంక్ సాధించాడు. ఇంగ్లాండ్ టూర్‌లో 14 వికెట్లు పడగొట్టిన ప్రసిద్ధ్ ఏకంగా 25 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. ప్రస్తుతం ప్రసిద్ధ్ 368 రేటింగ్స్‌లో 59వ ప్లేస్‌లో ఉన్నాడు. ప్రసిద్ధ్‌కు కూడా ఇదే కెరీర్ అత్యుతమ ర్యాంక్. కాగా, టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఎప్పటిలాగే తన అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. 889 రేటింగ్స్‌తో బుమ్రా టాప్‌లోనే కొనసాగుతున్నాడు. కాగా, టాప్ 10లో భారత్ నుంచి బుమ్రా ఒక్కడే ఉన్నాడు. కాగా, సిరాజ్ ఇంగ్లాండ్ పర్యటనలో ఐదో టెస్టులో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఒత్తిడిగా ఉన్న మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు (4 తొలి ఇన్నింగ్స్, 5 రెండో ఇన్నింగ్స్) దక్కించుకొని ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ఇక ఈ సిరీస్‌లో ఓవరాల్‌గా 23 వికెట్లు నేలకూల్చాడు. అంతేకాకుండా ఎలాంటి వర్క్ లోడ్ లేకుండా సిరాజ్ ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడాడు. ఇరుజట్లలో పూర్తి స్థాయిలో ఐదు మ్యాచ్‌లు ఆడిన ఏకైక బౌలర్ సిరాజే కావడం విశేషం. ఇక బ్యాటింగ్ విభాగంలోకి యశస్వీ జైస్వాల్ మూడు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. 792 రేటింగ్ పాయింట్లతో జైస్వాల్ టాప్-5లోకి చేరుకున్నాడు. ప్రస్తుతం అతుడ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే రిషభ్ పంత్ (768 రేటింగ్స్) 8వ స్థానంలో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (725 రేటింగ్స్) 13వ ప్లేస్‌సో కొనసాగుతున్నాడు. ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ టాప్ ప్లేస్ పదిలం చేసుకున్నాడు. 908 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆల్‌రౌండర్ల లిస్ట్‌లో టాప్‌లోనే కొనసాగుతున్నాడు. 405 రేటింగ్స్‌తో జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో జడేజా అద్భుతంగా రాణించాడు. బ్యాటింగ్‌లో 516 పరుగులు బాదిన జడ్డూ, బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ లిస్ట్‌లో జడ్డూ తర్వాత మెహదీ హసన్ (305 రేటింగ్స్), బెన్ స్టోక్స్ (295 రేటింగ్స్), వియాన్ మల్డార్ (284 రేటింగ్స్), ప్యాట్ కమిన్స్ (270 రేటింగ్స్) వరుసగా ఉన్నారు. ఐదవ టెస్ట్‌లో సెంచరీ సాధించిన ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో 3 స్థానాలు ఎగబాకాడు. అతను టాప్ 5లో చేరాడు, అతను ఇంతకు ముందు 8వ స్థానంలో ఉన్నాడు మరియు ఇప్పుడు 792 రేటింగ్‌తో ఐదవ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నాడు. నంబర్ 1 టెస్ట్ బ్యాట్స్‌మన్ కిరీటం జో రూట్ వద్దే ఉంది, అతను 5వ టెస్ట్‌లో సెంచరీ కూడా సాధించాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 908 రేటింగ్ పాయింట్లతో టాప్ పొజిషన్ కొనసాగిస్తున్నాడు. ఇంగ్లాండ్ కే చెందిన హ్యారీ బ్రూక్ 2, కేన్ విలియమ్సన్ 3, స్టీవ్ స్మిత్ 4, యశస్వీ జైస్వాల్ 5వ స్థానాల్లో నిలిచారు. టెస్ట్‌లో నంబర్ 1 ఆల్ రౌండర్‌గా రవీంద్ర జడేజా కొనసాగుతున్నాడు. ఇంతకు ముందు 7వ స్థానంలో ఉన్న జో రూట్ ఇప్పుడు 8వ స్థానానికి పడిపోయాడు. గస్ అట్కిన్సన్ ఒక స్థానం ఎగబాకి 9వ స్థానానికి చేరుకున్నాడు. టాప్ 5 లో ఎలాంటి మార్పు లేదు. టెస్టు ఆల్ రౌండర్లలో జడేజా ఆదిపత్యం కొనసాగుతోంది. 405 రేటింగ్ పాయింట్లతో జడేజా నెంబర్ వన్ గా కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న మెహదీ హసన్ కంటే ఏకంగా 100 రేటింగ్ పాయింట్లు అధికంగా జడేజా ఖాతాలో ఉన్నాయి. బెన్ స్టోక్స్ 3, వియాన్ ముల్డర్ 4, పాట్ కమిన్స్ 5వ స్థానాల్లో ఉన్నారు.

# టీమిండియాలో ఊహించని మార్పులు

## జట్టు సారథ్య బాధ్యతలపై ఉత్కంట



ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ డ్రా అయిన తర్వాత టీమిండియా నెక్ట్స్ టార్గెట్ ఆసియా కప్ 2025. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుండి 28 వరకు యూఏఈలో జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కోసం భారత జట్టులో ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి ఏయే ఆటగాళ్లకు అవకాశం లభిస్తుంది సూర్యకుమార్ యాదవ్, బుమ్రా వంటి సీనియర్లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉందనే వార్తలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఆసియా కప్ 2025 కోసం టీమిండియా సన్నద్ధమవుతోంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ నెలలో యూఏఈలో జరగనుంది. భారత్ గ్రూప్ %ా%లో పాకిస్థాన్, యూఏఈ, ఒమాన్‌తో కలిసి ఉంది. ఈ టోర్నమెంట్ కోసం భారత జట్టులో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవల హర్నియా సర్జరీ చేయించుకున్నాడు. అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సూర్యకుమార్ యాదవ్ ఆసియా కప్‌లో ఆడే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. అతనితో పాటు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. వీరిద్దరూ టీ20 వరల్డ్ కప్ కోసం సన్నద్ధం కావాల్సి ఉండటంతో, సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకోవచ్చు. సూర్యకుమార్ యాదవ్ గైర్హాజరీలో, జట్టు సారథ్య బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో యువ ఆటగాళ్లైన శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ ఆసియా కప్ జట్టులో తమ స్థానాలను పదిలం చేసుకునే అవకాశం ఉంది. స్థిరంగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్ కూడా జట్టులో చోటు దక్కించుకోవచ్చు. కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో యువ బ్యాట్స్‌మెన్లు సంజు శాంసన్, తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్, రింకూ సింగ్లకు కూడా చోటు లభించవచ్చు. ఆల్ రౌండర్ల విషయంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్లకు బాధ్యతలు అప్పగించవచ్చు. పేస్ బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ వంటి యువ పేసర్లు ఉండవచ్చు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలకు అవకాశం ఉంది. వరుణ్ చక్రవర్తి టీ20ల్లో తిరిగి వచ్చిన తర్వాత అద్భుతంగా రాణించాడు.

# శుభమన్ గిల్‌కు ఐసీసీ అరుదైన గౌరవం



టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచిన గిల్, ఇప్పుడు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఇది అతనికి నాలుగోసారి ఈ అవార్డు గెలుచుకునే అవకాశం వచ్చింది. జూలై 2025కు గాను ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ముగ్గురు ఆటగాళ్లు నామినేట్ అయ్యారు. ఈ జాబితాలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తో పాటు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ ఉన్నారు. జూలై నెలలో శుభ్‌మన్ గిల్ ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌లలో 94.50 సగటుతో ఏకంగా 567 పరుగులు చేశాడు. ఇందులో బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 269, రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేశాడు. అంతేకాకుండా, నాలుగో టెస్టులో 103 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రా చేయడంలో కీలక పాత్ర పోషించాడు. గిల్ ఇప్పటికే మూడు సార్లు (జనవరి 2023, సెప్టెంబర్ 2023, ఫిబ్రవరి 2025) ఈ అవార్డును గెలుచుకున్నాడు. ఇప్పుడు నాలుగోసారి ఈ అవార్డును అందుకోవాలని ఆశిస్తున్నాడు. సౌతాఫ్రికాకు చెందిన ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల్లో అతను 265.50 సగటుతో 531 పరుగులు చేశాడు. మొదటి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 147 పరుగులు, రెండో టెస్టులో కెప్టెన్‌గా 367 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టెస్ట్ క్రికెట్‌లో సౌతాఫ్రికా తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి 7 వికెట్లు పడగొట్టాడు. అతని అద్భుతమైన ఆల్‌రౌండర్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా అందుకున్నాడు. ఇంగ్లాండ్ టెస్ట్ టీమ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా ఈ అవార్డుకు నామినేట్ అయ్యాడు. జూలైలో భారత్‌తో ఆడిన మూడు టెస్టుల్లో స్టోక్స్ 50.20 సగటుతో 251 పరుగులు చేసి, 26.33 సగటుతో 12 వికెట్లు తీశాడు. లార్డ్స్, మాంచెస్టర్ టెస్టుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను కూడా గెలుచుకున్నాడు. ఈ ముగ్గురిలో ఎవరు ఈ నెల అవార్డును గెలుచుకుంటారో చూడాలి.

# భరత్ విజయంపై బుమ్రా ఆనందం

అంతగా అనుభవం లేని యువ జట్టుతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమిండియా అద్భుతమైన ఫలితాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఐదు టెస్టుల సిరీస్ ను 2-2తో సమం చేసింది. తాజాగా ఈ విజయంపై భారత స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా ఆనందం వ్యక్తం చేశాడు. సుదీర్ఘమైన ఈ టెస్టు సిరీస్ ఎన్నో మధురానుభుతులను నింపిందని పేర్కొన్నాడు. చాలా కఠినమైన, పోటీతత్వంతో కూడిన ఈ సిరీస్ ద్వారా ఎంతో నేర్చుకున్నమాని సోషల్ మీడియా వేదిక ఇన్ స్టాగ్రామ్ లో పోస్టు చేశాడు. అనంతరం నెక్ట్స్ ఏంటి.. అని సరదాగా అభిమానులను ప్రశ్నించాడు. చాలా మంది యువకులతో కూడిన టీమిండియాలో బుమ్రాతోపాటు కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మాత్రమే అంతర్జాతీయ టెస్టుల్లో సుదీర్ఘ అనుభవం ఉండగా, మహ్మద్ సిరాజ్ కు కాస్త ఎక్స్ పిరీయన్స్ ఉంది. అయినప్పటికీ, కఠినమైన ఇంగ్లాండ్ గడ్డపై ఆ జట్టును సవాలు చేసి, దాదాపు ప్రతి టెస్టులో ఇండియానే డామినేట్ చేసింది. ఆఖరుకు సిరీస్ ను కూడా ఎవరూ ఊహించని విధంగా 2-2తో సమం చేసింది. ఈ సిరీస్ లో ముందే చెప్పినట్లుగా బుమ్రా కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడాడు. అయినప్పటికీ నాలుగో లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఓవరాల్ గా 14 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అందులో రెండు ఫైఫర్ లు ఉండటం విశేషం. తను ఆడని రెండు టెస్టుల్లోనే టీమిండియా గెలుపొందడం విశేషం. మరోవైపు ఈ టూర్ గురించి భారత స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా ఎమోషనల్ గా పోస్టు పెట్టాడు.

# బెన్ స్టోక్స్‌పై సచిన్ ఆగ్రహం



ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌పై టీమిండియా దిగ్గజం, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్ -సచిన్ ట్రోఫీలో భాగంగా మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్ట్‌లో బెన్ స్టోక్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీకి చేరువైన టీమిండియా ఆల్‌రౌండర్స్ వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజాలను డ్రాకు అంగీ కరించాలని బెన్ స్టోక్స్ ఒత్తిడి చేశాడు. దానికి అంగీ కరించకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బెన్ స్టోక్స్ నోరు పారేసుకున్నాడు. హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ బౌలింగ్‌లో సెంచరీ చేస్తారా అని హేళనగా మాట్లాడాడు. సెంచరీలు అనంతరం భారత్ డ్రాకు అంగీ కరించినా.. జడేజాకు షేక్ హ్యాండ్ ఇవ్వకుండా స్టోక్స్ అసహనం వ్యక్తం చేశాడు. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించిన స్టోక్స్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ ఘటన గురించి మాట్లాడిన సచిన్.. బెన్ స్టోక్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో ముమ్మాటికి అతనిదే తప్పన్నాడు. 'వాషింగ్టన్ సుందర్, జడేజా సెంచరీలు సాధించారు. ఇందులో క్రీడా స్ఫూర్తికి విరద్ధంగా ప్రవర్తించడం ఏం ఉంది ఈ ఇద్దరూ డ్రా కోసం గొప్ప పోరాటం చేశారు. ఇంగ్లండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అప్పటికీ సిరీస్ ఇంకా డిసైడ్ అవ్వలేదు. అలాంటి సమయంలో భారత ఆటగాళ్లు డ్రాకు ఎందుకు అంగీ కరించాలి. ఇంగ్లండ్ ఆటగాళ్లకు వారు ఎందుకు విశ్రాంతి ఇవ్వాలి హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ చేయాలనేది బెన్ స్టోక్స్ ఇష్టం. అది భారత్ సమస్య కాదు. నా వరకైతే జడేజా, సుందర్ చేసింది సరైనదే. వారు సెంచరీల కోసం కాకుండా డ్రా కోసం ఆడారు. ఆ పోరాటానికి ఫలితంగా శతకాలు దక్కాయి. వారు ఆరంభంలోనే ఔటై ఉంటే ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిచేది కాదు. వారు బ్యాటింగ్‌కు వచ్చిన కొత్తలో హ్యారీ బ్రూక్ బౌలింగ్ చేయలేదు కదా.. ఇందుకు ఇంగ్లండ్ వద్ద సమాధానం ఉందాఈ విషయంలో భారత జట్టుకు 100 శాతం మద్దతు ఇస్తాను. అది గంభీర్, శుభ్‌మన్, జడేజా, వాషింగ్టన్ ఎవరైనా సరే.. వారికి నా మద్దతు ఉంటుంది. గత మ్యాచ్‌లో సుందర్ అద్భుతంగా ఆడాడు కదా వేగంగా ఆడాల్సినప్పుడు ఆ బాధ్యతను పూర్తి చేశాడు.'అని సచిన్ ప్రశంసించాడు.

# ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్.. వాషింగ్టన్ సుందర్

ఇంగ్లాండ్ పర్యటనను టీమ్ఇండియా ఘనంగా ముగించింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను యువ భారత్ 2-2తో సమం చేసుకొని సగర్వంగా సత్తాచాటింది. ఈ సిరీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అదిరే బ్యాటింగ్‌తో జట్టును ముందుండి నడిపించగా, మిగతా సహచరుల నుంచి సహకారం లభించింది. ముఖ్యంగా సిరీస్‌లో ఓవల్ వేదికగా జరిగిన చివరి టెస్టులో టీమ్ఇండియా థ్రిల్లింగ్ విక్టరీ అందుకుంది. అయితే సిరీస్ ఆసాంతం టీమ్ఇండియ సమష్టి కృషితో రాణించింది. గిల్ 754 పరుగులతో సిరీస్‌లోనే టాప్ స్కోరర్‌గా నిలువగా, ఓపెనర్ కేఎల్ రాహుల్ 532 పరుగులతో ఆకట్టుకున్నారు. ఇక సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా సత్తా చాటాడు. బ్యాటింగ్‌లో 516 పరుగులు బాదిన జడ్డూ, బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి రాణించాడు. రిషభ్ పంత్ 479 రన్స్ చేయగా, యంగ్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ 411 విలువైన పరుగులు చేశాడు. బౌలింగ్‌లో మహ్మద్ సిరాజ్ 23 వికెట్లతో సత్తా చాటి, సిరీస్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. అతడి తర్వాత భారత్‌లో జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ చెరో 14 వికెట్లతో ఆకట్టుకున్నారు.

# ఎన్టీఆర్ సినిమాకు భారీగా ధరలు



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 చిత్రం. ఈ సినిమా హిందీలో సాధారణ ధరలతో విడుదల కాబోతుండగా, డబ్బింగ్ వెర్షన్ తెలుగులో మాత్రం టికెట్ ధరలను నిర్మాతలు పెంచబోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతి స్టార్ సినిమాకు పెరుగుతున్న టికెట్ ధరలతో పాటు, డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచడం ప్రస్తుతం నెటిజన్ల ఆగ్రహానికి కారణమవుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2 సినిమాతో పాటు రజనీకాంత్ నటిస్తున్న కూలీ చిత్రాలు సొంత భాషల్లో సాధారణ టికెట్ ధరల్లోనే ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుండగా.., తెలుగులో ఈ సినిమాలకు టికెట్ ధరలను పెంచబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవే కాకుండా ఇంతకుముందు వచ్చిన చాలా తెలుగు సినిమాలకు కూడా టికెట్ ధరలను పెంచి జనాన్ని థియేటర్లకు రాకుండా చేస్తున్నారు నిర్మాతలు. దీంతో సోషల్ మీడియాలో ఈ అంశంపై తీవ్రమైన ట్రోలింగ్ జరుగుతోంది. "ఒకే సినిమా, ఒకే కంటెంట్, కానీ వేర్వేరు భాషలకు వేర్వేరు ధరలు ఎందుకు?" అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. "ఇది తెలుగు ప్రేక్షకులను దోచుకోవడమే" అని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో తెలుగు సినీ పరిశ్రమ స్పందించాల్సిన అవసరం ఉందని, లేకపోతే ప్రేక్షకులు సినిమా చూడటం మానేసి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడటం పెరుగుతుందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. ఇది భవిష్యత్తులో తెలుగు సినిమా పరిశ్రమకు చాలా నష్టం కలిగించే అవకాశం ఉందని తెలుపుతున్నారు. గతంలో ఒక సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.150 నుండి రూ.200 వరకు ఉండేది. కానీ ఇప్పుడు కొత్తగా విడుదలయ్యే ప్రతి స్టార్ సినిమాకు టికెట్ ధరలు రూ.300 నుండి రూ.400 వరకు చేరుకున్నాయి. కొన్ని మల్టీప్లెక్స్‌లలో అయితే మొదటి వారం టికెట్ ధరలు రూ.500 వరకు కూడా పెంచుతున్నారు. ఈ ధరలు సామాన్య ప్రేక్షకుడికి చాలా భారంగా మారాయి. దీంతో కుటుంబంతో కలిసి సినిమా చూడాలంటే దాదాపు రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది.



# సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటదో సూద్దురు

''పది మంది బతుకుల్ని నాశనం చేసే బతుకు బతుకేనా'' అని ప్రశ్నిస్తోంది నటి అనుష్క. ఇప్పుడామె ప్రధాన పాత్రధారిగా క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన చిత్రం 'ఘాటి'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మించారు. విక్రమ్ ప్రభు, జగపతిబాబు, చైతన్యరావు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా సెప్టెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యం లోనే బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ''ఈ ఘాట్లలో ఘాటీలు ఉంటారు సర్. బ్రిటిష్ కాలంలో కొండలు బద్దలు కొట్టి రక్తంతో రోడ్లు వేసేవాళ్లు. ఇప్పుడు గంజాయి మోసే కంచర గాడిదలు'' అంటూ ఓ వ్యక్తి చెప్పే వాయిస్ ఓవర్‌తో మొదలైన ట్రైలర్.. ఈ చిత్ర కథ, పాత్రలపై ఓ స్పష్టత ఇచ్చింది. ఆంధ్రా – ఒడిశా సరిహద్దుల్లో జరిగే కథ ఇది. అనుష్క, విక్రమ్ ప్రభు గంజాయి స్మగ్లింగ్ చేసే ఘాటీలుగా కనిపించారు. వాళ్లు తాము చేస్తున్న పని తప్పని తెలుసుకుని ఆ నేర వృత్తి నుంచి బయటకొచ్చి.. గంజాయి ముఠాను నడిపించే వ్యవస్థపై తిరుగుబాటుకు సిద్ధపడినప్పుడు ఏం జరిగింది? వాళ్లకు ఎదురైన సవాళ్లేంటి? అన్నది ప్రచార చిత్రంలో ఆసక్తికరంగా చూపించారు. అనుష్క ఇందులో యాక్షన్ కోణంలో సాగే శక్తిమంతమైన పాత్రలో అలరించనుంది. ''సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటదో సూద్దురు గాని'' అంటూ ట్రైలర్ ఆఖర్లో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సాగర్ నాగవెల్లి సంగీతమందించారు.

# చిరంజీవి బర్త్‌డేకు 157 సినిమా ఫస్ట్ లుక్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు చిరంజీవి కొత్త సినిమాను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడితో తన కొత్త ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాడు. మెగా 157 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి తాజా అప్‌డేట్ ఒకటి బయటకి వచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా టైటిల్‌తో ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. చిరంజీవి ఈ చిత్రంలో తన నిజమైన పేరు శంకర్ వరప్రసాద్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో కథానాయికగా తమిళ లేడి సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించబోతుంది.





# ట్రోల్స్‌కు స్పందించను: చిరంజీవి

సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోల్స్‌పై తాను స్పందించనని తెలిపాడు అగ్రనటుడు చిరంజీవి. ఫీనిక్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్‌కి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు నటుడు చిరంజీవి, తేజ సజ్జా. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన ఒక జర్నలిస్ట్ వలన వచ్చిందని ఈ విషయంలో అతడికి ఎప్పుడూ రుణపడి ఉంటానని చిరంజీవి అన్నారు. ఈ కార్యక్రమంకి వచ్చి బ్లడ్ డోనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజసజ్జాకు కూడా బ్లడ్ డోనేట్ చేసినందుకు ధన్యవాదాలు. రక్తదానం పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం. ఈ సందర్భంగా ఒక విషయం మీతో పంచుకోవాలి అనుకుంటున్నాను. ఎవరో ఒకరు రాజకీయ నాయకుడు కారణం లేకుండా నన్ను విమర్శించడం మొదలుపెట్టాడు. నేను ఇప్పుడూ రాజకీయల్లో కూడా లేను. అయిన కూడా అప్పుడప్పుడు విమర్శలు వస్తునే ఉంటాయి. అయితే ఈ నాయకుడు ఒకరోజు ఎదో ముంపు ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఒక మహిళ అతడిని నిలదీస్తూ.. చిరంజీవిని అలాంటి మాటాలు అనాలని మీకు ఎందుకు అనిపించిందంటూ కడిగి పారేసింది. దీంతో ఆ వీడియో చూసి ఎమోషనల్ అయ్యాను. ఆ తర్వాత ఆమె వివరాలు తెలుసుకోగా.. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిసి నాకు గుండె ఉప్పొగింది. అయితే సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై నేను ఎందుకు స్పందించరంటూ అందరూ నన్ను అడుగుతారు. నేను ఎప్పుడూ స్పందించను. నేను చేసే మంచి పనులు నాపై అభిమానుల ప్రేమే నాకు రక్షణ కవచాలు. విమర్శలపై నేను స్పందించాల్సిన పనిలేదు. నా మంచితనమే మాట్లాడుతుందంటూ చిరంజీవి చెప్పుకోచ్చాడు.

# వరుస ప్లాప్స్‌తో కనిపించకుండా పోయిన హీరోయిన్

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా రాణించిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడి గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. తన అందంతో, నటనతో తెలుగు ప్రజలను కట్టిపడేసింది ఈ చిన్నది. 18 ఏళ్ల వయసులో కాలేజీలో చదువుతున్నప్పుడే మోడలింగ్‌లో కెరీర్ ప్రారంభించి 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో తన హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. ఆ తరువాత 2011 కెరటంలో సిద్ధార్థ్ రాజ్‌కుమార్ సరసన నటించింది, ఇది తెలుగు మరియు తమిళ భాషలలో విడుదలైంది. ఆ తరువాత తెలుగులో వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న రకుల్ ప్రీత్ సింగ్, ఆ తర్వాత చాలామంది స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ఇదిలా ఉండగా ఇటీవలే తాను ప్రేమించిన ప్రముఖ బాలీవుడ్ నటుడు నిర్మాత అయిన జాకీ భగ్నానీ నీ ప్రేమించి మరీ వివాహం చేసుకుంది. ఒకవైపు సినిమాలలో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ వలకబోస్తూ అందాల ఆరబోతతో యువతకు చెమటలు పట్టించే ప్రయత్నం చేస్తోంది. కానీ తెలుగులో సినిమాలు తగ్గించింది ఈ వయ్యారి భామ. తెలుగులో రకుల్ నటించిన లాస్ట్ ఎనిమిది సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ తగ్గాయి. దాంతో ఈ చిన్నది సోషల్ మీడియాలో పోస్ట్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అలాగే హిందీలోనూ సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. ఇప్పుడు ఈ బ్యూటీ సినిమాల పరంగా సైలెంట్ అయ్యింది. సినిమాల్లో బిజీగా లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను పలకరిస్తుంది రకుల్. ఈ క్రమంలోనే తాజాగా కొన్ని ఫోటోలను వదిలింది ఈ వయ్యారి భామ.

# అంచనాలు పెంచుతున్న మంచు మనోజ్ సినిమా టైటిల్



టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు. ఢిల్లీలో పెరిగాడు. ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు. సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. 21 టైటిల్ 'డేవిడ్ రెడ్డి'. ఇది 1897..1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా" అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు "డేవిడ్ రెడ్డి" అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# చీరకట్టులో కవ్విస్తున్న నిత్యశ్రీ

కంచరపాలెం సినిమాలో చూపించిన సంఘటనల్లో ఒక్కటైనా మన జీవితంలోనూ ఎదురై ఉంటుంది. ఇక కంచరపాలెం సినిమాలోని ప్రతి క్యారెక్టర్ ప్రేక్షకులకు బాగా దగ్గరయింది. అలాగే ఈ సినిమాలో నటించిన చైల్డ్ ఆర్టిస్ట్‌లు గుర్తున్నారా..? చక్కటి నటనతో ఆకట్టుకున్నారు అందరూ. పై ఫొటోలో కనిపిస్తున్న చిన్నది కూడా తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. తన క్యూట్ క్యూట్ నటనతో ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది ఆ చిన్నది. పై ఫొటోలకనిపిస్తున్న చిన్నారి పేరు నిత్యా శ్రీ.. కంచెరపాలెం సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది నిత్యా. ఈ సినిమా తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది నిత్యా. మొన్నమధ్య ధనుష్ నటించిన సార్ సినిమాలో కనిపించింది. ఈ చిన్నారి ఇప్పుడు ఎలా ఉందో తెలుసా..? ఈ అమ్మడు చాలా అందంగా మారింది. హీరోయిన్స్ కు ఏమాత్రం తీసిపోని అందంతో ఆకట్టుకుంటుంది నిత్యా. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది. పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటిస్తుంది ఈ చిన్నారి. అలాగే క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇటీవలే ఓ సినిమాలో హీరోయిన్ గా ఎంపికైందని తెలుస్తుంది.



# ఈడీ విచారణకు హాజరైన విజయ్ దేవరకొండ

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని నటుడు ప్రకాశ్ రాజ్‌తో పాటు పలువురు నటులకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో గత నెల 30న ప్రకాశ్ రాజ్ హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అయితే నేడు విచారణకు రావాలని విజయ్‌కి నోటీసులు జారీ చేయగా.. తాజాగా అతడు ఈడీ ముందు విచారణకు హాజరయ్యాడు. తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు పలువురు సినీ సెలబ్రిటీలపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే హీరోలు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండతో పాటు రానా దగ్గుబాటి, నటి మంచు లక్ష్మి వంటి వారికి కూడా ఈడీ నోటీసులు పంపింది. రానా దగ్గుబాటి ఇప్పటికే విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. సినిమా షూటింగ్‌లు ఉండడంతో విచారణకు మరికొంత సమయం కోరాడు.



RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in